సాక్షి చిత్తూరు

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



మే13,14 తేదీల్లో గంగజాతర

చిత్తూరులో నడివీధి గంగజాతర మే13,14 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సీకే లావణ్య తెలిపారు. - 8లో



ఎట్టకేలకు మోటారు ఏర్పాటు

పెద్దపంజాణి మండలం బసవరాజు కండ్రిగలో బోరుకు ఎట్టకేలకు మోటారు అమర్చారు. - 8లో



ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టిన ఘటన దొరవారి సత్రం మండలంలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

30 నుంచి అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి

చిత్తూరు కార్పొరేషన్: స్లాట్ బుకింగ్ విధానం ఈ నెల 30వ తేదీ నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు అవుతుందని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. జిల్లాలో ఈనెలాఖరు నుంచి అమలు కానున్న స్లాట్ బుకింగ్ విధానంపై సబ్‌రిజిస్ట్రార్, సీనియర్ సహాయకులకు మంగళవారం చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి మాట్లాడుతూ స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి స్లాట్ బుకింగ్ విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రమే ఈ విధానం వాడుకలో ఉందన్నారు. జిల్లాలోని మిగిలిన 7 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్‌సహాయకులు పాల్గొన్నారు.

జూనియర్ జడ్జిల బదిలీలు

తిరుపతి లీగల్/ చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ జడ్జీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు మూడో అదనపు జూనియర్ జడ్జి ఎస్.శ్రీనివాస్‌ను పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, నగిరి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.విష్ణువర్మను వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జిగాను, పీలేరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.గాయత్రిని గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, పుత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణను తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై. సరితను బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, గన్నవరం అదనపు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి బి.శిరీషను చిత్తూరు మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, ఒంగోలు మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.శిల్పను చిత్తూరు ఎక్సైజ్ కోర్టు జడ్జిగా, తణుకు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ. వెంకట నాగరాజును సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జిగా, ధర్మవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్య సాయిని పుత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా, కల్యాణదుర్గం సివిల్ జడ్జి బి.సుభాన్‌ను మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన న్యాయమూర్తులు మే రెండో తేదీలోపు ఆయా ప్రాంతా ల్లో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు సందిగ్ధంగా మారింది. కర్షకులకు గత ఏడాది పంట నష్ట పరిహారం ఇప్పటికీ అందలేదు..దీనికితోడు పెట్టుబడి సాయం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో వైపు వరుణుడు కరుణ కోసం పుడమి పుత్రుడు నిరీక్షిస్తున్నాడు. ప్రభుత్వం రాయితీ విత్తనం ఇస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ స్థితిలో ఖరీఫ్ సాగుపై రైతులు మొగ్గు చూపడం లేదు.



అందని సాయం.. సాగు సందిగ్ధం



- జిల్లాలో గతేడాది వేరుశనగ నేలమట్టం
- చేతి కందని దిగుబడి
- పరిశీలించిన కేంద్ర బృందం
- అందని నష్టపరిహారం
- ముంచుకొస్తున్న వేరుశనగ సాగు సమయం

కాణిపాకం: జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో కర్షకులు సాగు చేసిన పంట వర్షాభావంతో ఎండిపోయింది. రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. జిల్లాలో కరువు పరిస్థితులను అంచన వేయడానికి అప్పట్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటించింది. నష్టాలను పరిశీలించి, అంచనా వేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ నష్టానికి సంబంధించిన పరిహారం అందలేదు. దీంతో రైతులు కుదేలవుతున్నారు. దీనికితోడు పెట్టుబడి సాయం (రైతు భరోసా) అందలేదు. ఈ నేపథ్యంలో ఈసారి ఖరీఫ్ సాగు కష్టమనిపిస్తోంది.

సమీపిస్తున్న ఖరీఫ్

త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఖరీఫ్‌లో వర్షధార పంటగా జిల్లాలో వేరుశనగను సాగు చేస్తారు. వర్షాలు సకాలంలో కురిస్తే రైతులు మే నెల నుంచి దుక్కులు చేస్తారు. కత్తెర ముగిసిన వెంటనే (మే15 తర్వాత) మరో రెండు దుక్కులు చేసి, విత్తనాలు విత్తేందుకు సమయత్తమవుతారు. ఇందుకోసం విత్తన కాయలను సిద్ధం చేసుకుంటారు. కొంత మంది రైతులు మే నెల చివరి వారం నుంచి విత్తనం వేస్తారు.

10,338 క్వింటాళ్ల విత్తనం అవసరం

ఖరీఫ్ దృష్ట్యా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేశారు. ఆ నివేదికలను ప్రభుత్వానికి పంపారు. ముందస్తు సాగు అంచనా ఆధారంగా వేరుశనగ విత్తనం 10,338 క్వింటాళ్లు అవసరమవుతోందని ప్రతిపాదనలో చూపారు. అలాగే కందులు 323 క్వింటాళ్లు, ఉలవలు, 1720 క్వింటాళ్లు, పెసలు 37 క్వింటాళ్లు, రాగులు 280 క్వింటాళ్లు, జీలుగ 378 క్వింటాళ్లు, జనుము1,156 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు విత్తనాలు జిల్లాకు సరఫరా అవుతాయో..కాదో తెలియని పరిస్థితి.

ఈ సారి ఖరీఫ్ హుళక్కేనా?

గతేడాది ఖరీఫ్‌లో నష్టాలను చవిచూసిన రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై మొగ్గు చూపడం లేదు. అంతో..ఇంతో వేరుశనగ పండించే రైతులు కూడా మామిడి, కొబ్బరి మొక్కల సాగుపై దృష్టి సారిస్తున్నారు. కొంత మంది ఆచి తూచి అడుగులు వేయాలని యోచిస్తున్నారు. విత్తు వేసి చేతులు కాల్చుకోవడం కంటే బీడు వదిలేయడం మేలన్న నిర్ణయానికి వచ్చేస్తున్నారు. ఈ కారణంగా వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవచ్చని రైతులు అంటున్నారు.

గతేడాది నష్టం ఇలా ..

గతేడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లుగా కాగా 13,044 హెక్టార్లల్లో పంట సాగు చేశారు. అయితే వర్షం కరుణించక పంట పూర్తిగా దెబ్బతింది. పరిశీలనకు దిగిన వ్యవసాయ శాఖ అధికారులు 9 వేల హెక్టార్లల్లో మాత్రమే పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. 24,342 మంది రైతులకు గాను రూ.15.42 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ మేరకు ప్రభుత్వం గుడిపాల, పెనుమూరు, యాదమరి మండలాలను అత్యంత కరువు మండలాలుగా ప్రకటించింది. మరో 13 మండలాలలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గత జనవరి 8వ తేదీన కేంద్ర బృందం యాదమరి, గుడిపాల మండలాలను సందర్శించి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులతో ముఖాముఖి నిర్వహించింది. అలాగే మిగిలిన మండలాల్లో కూడా వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి విషయంలో వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ పరిణామాలు రైతులను ఆందోళనలో నెట్టేస్తున్నాయి.



గుడిపాల మండలంలో పర్యటించిన కేంద్ర బృందం (ఫైల్)

జిల్లా సమాచారం...

గతేడాది వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం	43,174
సాగు విస్తీర్ణం	13,044
నష్టం	9 వేల హెక్టార్లు
నష్టం అంచనా రూపాయల్లో	రూ.15.42కోట్లు
నష్టపోయిన రైతుల సంఖ్య	24,342
అత్యంత కరువు మండలాలు	యాదమరి, గుడిపాల, పెనుమూరు
మధ్యస్థ కరువు మండలాలు	13

గత ఐదేళ్లలో..రూ.886 కోట్లు

జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో ఏటా 1.80 లక్షల మందికి రైతు భరోసా కింద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. ఐదేళ్ల కాలంలో రూ.886 కోట్లు రైతు ఖాతాకు జమ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే కనిపించడం లేదు. దీంతో రైతులు పెట్టుబడి సాయం లేక రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది.

నష్టపోయాం



గత ఏడాది వేరుశనగ సాగు చేసి నష్టపోయాం. పంట చేతికి రాలేదు. తీగలు కూడా దక్కలేదు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడి పెడితే మూట కాయలు రాలేదు. ప్రభుత్వం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఏడాది పూర్తి కావస్తోంది. ఇంతవరకు పైసా పరిహారం ఇవ్వలేదు. ఈసారి రైతు భరోసా కూడా ఇస్తారో..లేదో తెలియడం లేదు. ఈ పరిస్థితుల్లో వేరుశనగ ఎలా సాగు చేస్తాం. వేసి చేతులు కాల్చుకోవడం వద్దని అనుకుంటున్నాం.

– చిట్టిబాబు, పాపసముద్రం, గుడిపాల మండలం

సివిల్స్‌లో మెరిసిన పలమనేరు ఆణిముత్యం



రంపం శ్రీకాంత్

పలమనేరు: మంగళవారం వెలువడిన యూపీపీఎస్సీ (సివిల్స్) ఫలితాల్లో పలమనేరు పట్టణానికి చెందిన రంపం శ్రీకాంత్ జాతీయ స్థాయిలో 904 ర్యాంకును సాధించి పలమనేరు పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టారు. పట్టణానికి చెందిన రంపం శ్రీకాంత్ ప్రాథమిక విద్యను పలమనేరులో, ఇంజినీరింగ్ సీబీఐటీ హైదరాబాద్‌లో, ఎంబీఏ ఐఐఎం బెంగళూరులో పూర్తి చేశారు. ఆపై పలు ఇంటర్నేషనల్ కంపెనీల్లో మార్కెటింగ్ హెడ్‌గా పనిచేశారు. ఎలాగైనా సివిల్స్‌కు ఎంపిక కావాలనే ఆకాంక్షతో ఎలాంటి శిక్షణ లేకుండానే సొంత ప్రణాళికతో 2025లో సివిల్స్ పరీక్ష రాసి ఉత్తమ ర్యాంకు సాధించారు. కాగా వీరి తల్లిదండ్రులు నాగరాజు, రేణుక ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన ఆయన సతీమణి శ్రావ్య, అత్తమామ, తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలను తెలిపారు.

ఉచిత వ్యాక్సినేషన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం హజ్ యాత్రికులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉచితంగా వ్యాక్సినేషన్ వేశారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాత్రకు వెళ్లే యాత్రికులు కచ్చితంగా ఈ సర్టిఫికెట్‌ను వెంట తీసుకెళ్లాలని ఆమె సూచించారు. కాగా 74 మందికి ఈ వ్యాక్సినేషన్‌ను అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఐఓ అనిల్‌కుమార్, స్టేట్ అబ్జర్వర్ నూరుద్దీన్, హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్వర సేవలు అందించాలి

- సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు నివారించండి
- రాత్రి సమయంలోనే ఎక్కువ ప్రమాదాలు
- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్స్ ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో సత్వర సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమష్టిగా పనిచేయాలన్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాలకు దగ్గరలో అత్యవసర వైద్య సేవలకు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాలు, వారి ఫోన్ నంబర్లు, అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూపుల వివరాలు, అంబులెన్స్ వివరాలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి వారం వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. బ్లాక్‌స్పాట్స్ ప్రదేశాల్లో సత్వరమే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా జాతీయ రహదారుల శాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లైటింగ్, రంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో 25 బ్లాక్‌స్పాట్లు

జిల్లాలో 25 బ్లాక్ స్పాట్లు జాతీయ రహదారుల్లో గుర్తించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 42, 69, 40, 140,716,71,75,716(ఏ) జాతీయ రహదారులు ఉన్నట్లు తెలిపారు. ఈ రోడ్లలో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా రోడ్డు దాటేందుకు (ఇల్లీగల్ క్రాసింగ్) ఏర్పాటు చేసిన రోడ్లను మూసి వేయాలన్నారు.

రాత్రి సమయాల్లోనే ఎక్కువ ప్రమాదాలు

జిల్లాలో జాతీయ రహదారుల్లో రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. అధికారులు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీ నిరంజన్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, డీపీఓ సుధాకర్‌రావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

- మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ డిగ్రీ కూడా పూర్తి చేయలేదు. తొలుత ఓ కంపెనీని స్థాపించి తీవ్రంగా నష్టపోయారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌పై తనకున్న కోరిక, విషయ పరిజ్ఞానం మైక్రోసాఫ్ట్ పేరిట సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించేలా చేసింది. ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ ఎదిగిన తీరు అందరికీ తెలిసిందే..
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ పాఠశాల స్థాయిలోనే గట్టెక్కలేకపోయారు. కానీ ఆయన కుంగిపోలేదు. సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారు. తొలి రోజుల్లో ఫెయిలయ్యానని నిరాశ చెంది ఉంటే ఆయన శాస్త్రవేత్తగా ఎదిగే వారే కాదు.

- పదో తరగతి పూర్తి చేయమని తల్లిదండ్రులు బలవంతం చేయడంతో మనస్తాపానికి గురైన పాలసముద్రం మండలం తిరుమల రాజపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఈ ఏడాది జనవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు.



చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

చిత్తూరు జిల్లాలో పది విద్యార్థులు	21,248
తిరుపతి జిల్లాలో పది విద్యార్థులు	28,656
మొత్తం విద్యార్థులు	49,904

చదువంటే మార్కులు... ర్యాంకులే కాదు

చదువు అంటే మార్కులు.. ర్యాంకులే కాదన్న విషయాన్ని విద్యార్థులు అర్థం చేసుకోలేకపోతున్నారు. తమ ముందే చదువులో సగటు విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతున్న తీరు చూసినా వారిలో మార్పు రావడం లేదు. ఓటమిని పాఠంగా తీసుకుని జీవితంలో ఎదిగే అవకాశమున్నా ఓటమి జీవితానికి అంతంగా భావిస్తున్నారు. ఉత్తీర్ణులు కాకపోతే మరింత కష్టపడాలి.. లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలి.

ఫెయిల్ అయితే ఆత్మహత్య.. పర్సంటైల్ తక్కువ వచ్చిందని బలవన్మరణం చెందడం .. ఇదీ ప్రస్తుతం. పదో తరగతి పిల్లలకు ఏమైంది.. ఫెయిల్ అయితే చనిపోతారా?.. వందేళ్ల జీవితాన్ని మొగ్గలోనే తుంచే వేళ.. నవ మాసాలు కష్టపడిన అమ్మ గుండెపై భారం మోపే క్షణం.. నాన్న ఆశల దీపాన్ని ఆర్పే సమయాన్ని గురించి ఒక నిమిషం ఆలోచిస్తే ఆత్మహత్యకు అడుగుపడదు.. ఆశల బండి పరుగు ఆగదు.

నిలుద్దాం.. గెలుద్దాం

- పది పబ్లిక్ పరీక్షలకు 49,904 మంది విద్యార్థులు
- నేడు పది పబ్లిక్ పరీక్షల ఫలితాలు
- క్షణికావేశం కంటే...క్షణం ఆలోచనే ముఖ్యం
- ప్రతిభకు మార్కులే కొలమానం కాదు

చిత్తూరు కలెక్టరేట్ : పరీక్షల ఫలితాలు వచ్చాయంటే పలువురు విద్యార్థులు క్షణికావేశానికి లోనవుతుంటారు. ఆ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడు తుంటారు. ఇది సరైన నిర్ణయం కాదని, ఆలోచించి, అడుగు ముందుకువేయాలని నిపుణులు అంటున్నారు. గత నెల 17 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు చిత్తూరు జిల్లాలో 21,248 మంది, తిరుపతి జిల్లాలో 28,656 మంది మొత్తం 49,904 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. రెండు జిల్లాల్లో ఏటా సగటున 7–12 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. చదువు ఇష్టం లేదని, హాస్టల్‌లో ఉండమని కొందరు, పరీక్ష ఫలితాల సమయంలో మరికొందరు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారు.

విద్యార్థులూ ఇది గుర్తించండి..

- ఆవేశంలో పిల్లలు అఘాయిత్యాలకు పాల్పడితే ఆ తల్లిదండ్రులకు జీవిత కాలం ఆవేదన తప్పదు.
- ఏ తల్లిదండ్రులైనా పిల్లల ఉన్నతినే ఆకాంక్షిస్తారు. వారు మందలించడం తమ మంచికేననే విషయం గుర్తించాలి.
- ఒక పరీక్ష తప్పితే వెంటనే మరో అవకాశం ఉంటుంది. జీవితం ముగిస్తే తిరిగి రాదు.

తల్లిదండ్రులు ఇవి గమనించండి..

- పిల్లలను పరీక్షల విషయంలో భయపెట్టొద్దు.
- తక్కువ మార్కులు వచ్చినా.. ఫెయిల్ అయినా మళ్లీ పుంజుకోవచ్చని ప్రోత్సహించాలి.
- జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎలా ఎదుర్కోవాలో ముందు నుంచే అర్థమయ్యేలా చూడాలి.
- మీలో ఉన్న ప్రతిభ ఏమిటో తల్లిదండ్రులకు స్పష్టంగా వివరించండి. ఆ దారిలో వెళ్లడానికి ఒప్పించి ముందుకు సాగండి.
- ఎదుటి వారితో పోల్చడం కాకుండా పిల్లల్లో స్వతహాగా ఉన్న ప్రతిభను గుర్తిస్తూ ఆత్మవిశ్వాసం పెంచాలి.
- ఏడాది మొత్తం వారు ఎలా చదువుతున్నారో పరిశీలించకుండా ఫలితాలు వెల్లడి కాగానే వేలెత్తి చూపడం సరికాదు.

ఒక్క క్షణం ఆగి ఆలోచించాలి....



ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. ఆ ఆలోచన మనసులోకి రాగానే ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చు జీవితమంటేనే నిత్య పరీక్షలను తట్టుకుంటూ.. నేర్చుకుంటూ ముందుకు సాగడం. మనకు ఎదురయ్యే సమస్యల కన్నా జీవితమనేది చాలా పెద్దదని గుర్తించాలి. సానుకూల దృక్పథంతో సాగుతూ ఓటమికి కారణాలు విశ్లేషించుకుని గెలుపు దిశగా సాగాలి.

– విజయ్‌చంద్ర, మెడికల్ ఆఫీసర్, బైరెడ్డిపల్లి

క్షణికావేశం వొద్దు



విద్యార్థులు ఫలితాల సమయంలో క్షణికావేశానికి లోనుకాకుడదు. ఫలితాలు ఎలా వచ్చినా విద్యార్థులు పాజిటివ్‌గా తీసుకోవాలి. ఫెయిలైన విద్యార్థి ఇంతటితోనే అంతా అయిపోయిందనే భావనను వీడాలి. ఓ పరీక్షలో మాత్రమే ఫెయిలయ్యామని, జీవితంలో కాదన్న విషయాన్ని గ్రహించాలి. ప్రధానంగా క్షణికావేశంకు గురికాకుడదు. తొందరపాటుగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. పది పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాం. ఎలాంటి ఫలితాలు వచ్చినా మెరుగైన ఫలితాలని భావిస్తాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

దండిచొద్దు.. ధైర్యం చెప్పండి



పది ఫలితాలు బుధవారం ఉదయం విడుదల కానున్నాయి. ఫలితాల్లో ఎవరైనా ఫెయిల్ అయితే తల్లిదండ్రులు వారిని దండించకుండా ధైర్యం చెప్పండి. ఫెయిల్ అయినప్పటికీ సప్లిమెంటరీ రూపంలో మరో అవకాశం ఉంటుంది. అది రాసి మళ్లీ పాస్ కావచ్చు. ఫెయిల్ అయ్యామని చులకనగా చూసే సమాజం ముందే తల్లెత్తుకుని జీవించవచ్చు. లోటుబాట్లు ఏవైనా ఉంటే పునరావృత్తం కాకుండా సరిదిద్దుకుంటాం.

– కేవీఎన్. కుమార్, డీఈఓ, తిరుపతి

మద్యం షాపు తొలగించాలని ధర్నా



మహరాజపురం బ్రాందీ షాపు వద్ద నిరసన చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

విజయపురం : తమిళనాడు సరిహద్దులోని మహరాజపురం వద్ద ఏర్పాటు చేసిన బ్రాందీ షాపును వెంటనే తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు, గ్రామస్తులు ధర్నా చేశారు. మంగళవారం బ్రాందీ షాపు ఎదురుగా షామినా వేసి, నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ తమ గ్రామాల్లో మద్యం షాపు ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రతిరోజు గొడవలు జరుగుతున్నాయని ఆరోపించారు. జనావాసాల నడుమ మద్యం షాపు ఉండడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులతో మద్యం బాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. రెండు రోజుల కిందట తమిళనాడు చెందిన కొందరు అల్లరిమూకలు మహరాజపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి చేశారని, ఆ విషయమై స్థానిక సర్పంచ్ కుమారుడు ప్రశ్నించగా అతనిపై కూడా దాడి చేశారన్నారు. అసలు మమ్మల్ని ఊళ్లో ఉండమంటారా.. ఊరు విడిచి వెళ్లమంటారా అంటూ మహిళలు పోలీసులను నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా బ్రాందీ షాపు అనుకుని పెద్ద పెద్ద దాబాలు ఉన్నాయని, అందులో మద్యం బాబులు మద్యం తాగి, ఘర్షణలకు పాల్పడుతున్నారని, వెంటనే దాబాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీసులు నిరసనకారులతో మాట్లాడి ఇలాంటి సంఘటన జరగకుండా భద్రత ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

పోలీసులు బెదిరిస్తున్నారు

బ్రాందీ షాపు తొలగించాలని శాంతియుతంగా నిరసన చేస్తుంటే స్థానిక పోలీసులు మమ్మల్ని బెదిరిస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే మమ్మల్ని బెదిరిస్తుంటే, మేం ఎవరికి చెప్పుకోవాలి. బ్రాందీ షాపుతో మా గ్రామానికి రక్షణ లేకుండా పోయింది. కళాశాలకు వెళ్లే విద్యార్థినుల పట్ల మందుబాబులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అరాచకాలను ప్రశ్నించిన నా కుమారుడిపై దాడిచేశారు. జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– సౌదామణి, సర్పంచ్, మహరాజపురం

క్లుప్తంగా

నిధులొక రోడ్డుకు.. నిర్మాణం మరోచోట!



రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం : మండలంలోని వెంకటాపురంలో ఓ రోడ్డుకు మంజూరైన నిధులతో మరో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గుర్తించిన గ్రామస్తులు ఆ పనులను మంగళవారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దాము స్వగ్రామం వెంకటాపురంలోని గోపి అనే వ్యక్తి ఇంటి వద్ద నుంచి సంధ్య ఇంటి వరకు రోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. అయితే ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దాము ఆ నిధులను పక్కదారి పట్టించాడు. తన బంధువుల పొలం ఉందని రాజపెరుమాళ్ అక్క చెరువు గడ్డపై రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామస్తులు రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం అడ్డుకున్నారు. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేని చోట రోడ్డు వేయడం దారుణమన్నారు. అనంతరం ఈ విషయమై ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ లోకనాథపిళ్లెకి ఫిర్యాదు చేశారు. అధికారులు సైతం ఎమ్మెల్యే పీఏ ఏమి చెబితే అదే చేస్తున్నారని వాపోయారు. ఎమ్మెల్యే పీఏనే ఈ విధంగా ప్రవర్తిస్తుంటే తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలోని రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ స్థానిక ఎమ్మెల్యే జగన్‌మోహన్‌తో కలిసి పరిశీలించారు. స్థానిక దుర్గమ్మ ఆలయం నుంచి కలెక్టరేట్ కూడలి వరకు వంద అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండగా.. ప్రణాళికలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలను కమిషనర్ నరసింహప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

పెనుమూరు(కార్వేటినగరం): అక్రమంగా సారా తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామచద్రయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ఈ వివరాలు వెల్లడించారు. సారా విక్రయం కేసులో పరారీలో ఉన్న ఎర్రమట్టిపల్లి గ్రామానికి చెందిన గోపాల్ కుమారుడు వెంకటేష్, అలాగే ఎర్రమట్టిపల్లి సమీపంలోని బాపనచెరువు వద్ద అక్రమంగా సారా తయారు చేస్తున్న అదే గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు భాస్కర్ అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

- ప్రయివేటు బస్సు బోల్తా ఘటనలో తల్లడిల్లిన బాధితులు
- అంబులెన్స్ ఆలస్యం కావడంతో రోడ్డుపైనే క్షతగాత్రులు



బోల్తా పడిన బస్సు, ట్రాక్టర్ ట్రాలీ

(రేణిగుంట శ్రీకాళహస్తి రూరల్): బాధితులు తల్లడిల్లిపోయారు. రక్తగాయాలతో ఆర్తనాదాలు పెట్టారు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. వివరాలు.. రేణిగుంట మండలం, మర్రిగుంట సర్కిల్‌లో మంగళవారం ఉదయం 7.40 గంటలకు ఓ ప్రయివేటు కంపెనీ బస్సు, ట్రాక్టర్ అతివేగంగా వచ్చి అదుపుతప్పి బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో బస్సులో ఉన్న సుమారు 45 మంది ఉద్యోగుల్లో 30 మంది మహిళా ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. బోల్తా పడిన బస్సు నుంచి బాధితులను స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. కానీ క్షతగాత్రులను సకాలంలో హాస్పిటల్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లేవీ అందుబాటులో లేవు. సుమారు అరగంటపాటు రోడ్డుపైనే రక్తగాయాలతో ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో బాధితుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆపై సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

రాంగ్ రూటే ప్రమాదానికి కారణం!

మర్రిగుంట సర్కిల్ నుంచి విమానాశ్రయ పాత రహదారిలోకి వెళ్లేందుకు సుమారు 500 మీటర్ల వరకు వన్‌వే ఉంది. తొందరగా గమ్యానికి చేరాలన్న ఉద్దేశంతో సర్కిల్ నుంచి వన్ వేలో వాహనాలను నడుపుతుంటారు. ఆ క్రమంలో హైవేలో అతివేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఇలాంటి ఘటనలే గతంలో అనేకం చోటు చేసుకున్నాయి. వన్‌వే ఉన్న ప్రాంతంలో కనీసం నో ఎంట్రీ బోర్డులు కూడా పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆస్పత్రిలో క్షతగాత్రులు



బోల్తాపడిన బస్సు



క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోలో తరలిస్తున్న దృశ్యం



తీవ్ర గాయాలైన మహిళా కార్మికురాలు



రోడ్డుపైనే ఆర్తనాదాలు పెడుతున్న క్షతగాత్రులు

మే13, 14 తేదీల్లో గంగజాతర

- మే 6న చాటింపు
- కరపత్రాలు ఆవిష్కరించిన జాతర నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర మే 13, 14 తేదీల్లో జరగనుందని జాతర వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు సతీమణి సీకే లావణ్య పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ దేవస్థానంలో మంగళవారం జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మే 13,14 తేదీల్లో చిత్తూరు నడివీధి జాతర జరుగుతుందన్నారు. మే 6న జాతర చాటింపు ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు కూడా ప్రారంభించామన్నారు. భక్తులు జాతర వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీరాశీ దారులు హేమంత్, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో 25 శాతం ఉచిత అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్లకు అవకాశం కల్పించారని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల్లో అడ్మిషన్లకు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్లు పూర్తి అయ్యి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పాఠశాలల్లో అడ్మిషన్లకు జూన్ 1 వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో అర్హత ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీ కోరారు.

గ్రామీణ క్రీడల ప్రోత్సాహానికే కబడ్డీ పోటీలు


- విన్నర్స్ రాణిపేట, రన్నర్స్ కాట్టుకండ్రిగ
- తృతీయ స్థానంలో బలిజకండ్రిగ యూత్ జట్టు
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి, చిత్రంలో బలిజకండ్రిగ కబడ్డీ జట్టు

పాలసముద్రం: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడానికి కబడ్డీ పోటీలు దోహదం చేస్తాయని మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి అన్నారు. మండలంలోని బలిజకండ్రిగ దళితవాడలో బలిజ కండ్రిగ యువత, వైఎస్సార్ సీపీ నాయకుడు పద్మనాభనాయుడు ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో మండలం నుంచి, తమిళనాడు రాష్ట్రం నుంచి 15 జట్లు తలపడ్డాయి. ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో మొదలైన ఈ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. సోమవారం ముగిశాయి. ఫైనల్స్‌లో రాణిపేట జట్టు–కాట్టుకండ్రిగ జట్టుపై విజయం సాధించింది. అలాగే బలిజకండ్రిగ యూత్, కావేరికాకం జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. విన్నర్స్‌కు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రూ 15 వేలు, రన్నర్స్‌కు శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్ బాబు రూ.10 వేలు, 3వ స్థానం జట్టుకు జెడ్పీటీసీ అన్బలగన్ రూ.7వేలు, 4వ స్థానం జట్టుకు వైఎస్సార్ సీపీ నాయకుడు మాకయ్య రూ 5వేలు స్పాన్సర్ చేశారు. ఆయా జట్లకు మాజీ సీఎం నగదు బహుమతులు, కప్‌లు అందజేసి మాట్లాడారు. వివిధ ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి కూడా క్రీడలు దోహదం చేస్తామయని, సుహృద్భావ వాతావరణంలో వీటిని విజయవంతంగా నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చందుశేఖర్‌రాజు, ఎంపీటీసీ గోవిందరాజులు, కుమార్, పోలయ్య, షణ్ముగరెడ్డి సుందరరాజు, సుబ్రమణ్యరెడ్డి, ఆనందన్, ప్రకాష్, కుట్టి, నరసింహ నాయుడు, సురేష్, రవిరెడ్డి పాల్గొన్నారు.


తాళంబేడు బోగస్ రేషన్‌షాపు



డీలర్ పేరు వీఆర్‌ఏది..ఫొటో కూటమి నేతది ఉన్న ఆన్‌లైన్ వివరాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం తాళంబేడులో బోగస్ పేరుతో రేషన్‌షాపు నడుస్తున్న సంఘటన గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగుచూసింది. వారి ఫిర్యాదు మేరకు.. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తులసిరెడ్డి 2024 ఆగస్టులో రాజీనామా చేశాడు. అదే ఏడాది సెప్టెంబర్ నెలలో షాపును శ్రీలక్ష్మి ఎస్‌హెచ్‌జీకి కేటాయించారు. అయితే ఈమె భర్తతో పాటు సౌత్‌ఆఫ్రికాలో ఉండడం గమనార్హం. తొలి నుంచి శ్రీలక్ష్మిని డమ్మీగా చూపి, ఆమె మామ నటరాజరెడ్డి వేలిముద్ర పెడుతూ సరుకులు పంపిణీ చేస్తున్నాడు. ఆమె సంతకాలను ఫోర్జరీ చేసి, సరుకులు పంపిణీ చేస్తూ వస్తున్నాడు. రెండు నెలలకు క్రితం ప్రజాప్రతినిధుల సహకారంతో వీఆర్‌ఏగా ఉన్న గోపి పేరుతో మార్చారు. వీఆర్‌ఏ గోపి డీలర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో నటరాజరెడ్డి వేలిముద్ర ఆధారంగా రేషన్ ఇస్తున్నారు. ఆన్‌లైన్ వీఆర్‌ఏ గోపి పేరిట డీలర్‌గా నమోదైనప్పటికీ డీలర్ ఆధార్ నంబర్, ఫొటో తదితర వివరాలన్నీ నటరాజరెడ్డి పేరుతోనే కొనసాగుతున్నాయి. దీంతో నటరాజరెడ్డి వేలిముద్ర ఆధారంగా రేషన్ పంపిణీ జరుగుతోంది. ఇదీ ముమ్మాటికీ బోగస్ అంటూ గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు రేషన్ షాపును రద్దు చేసి, భవిష్యత్‌లో ఇలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రేషన్ కార్డు లేకుండా విదేశాల్లో ఉండే శ్రీలక్ష్మికి ఎలా రేషన్ షాపు కేటాయించారు. వీఆర్‌ఏకు షాపు ఇస్తే కూటమి నేత ఆధార్, ఫొటోలతో అనుసంధానం చేసి, సరుకులు ఇవ్వడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

పేట్రేగుతున్న కబ్జాదారులు



భూమిని చదును చేస్తున్న జేసీబీ

గంగాధర నెల్లూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మండలంలో భూ కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. మండలంలోని వింజం పంచాయతీ సిద్దేశ్వరస్వామికొండ గ్రామంలో సిద్దేశ్వరస్వామి, శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, సీతారాములస్వామి ఆలయాలకు అనుబంధంగా ఏళ్ల కాలం నాటి నుండి దేవాలయ అభివృద్ధికి, దేవాలయ ధూప దీప నైవేద్యానికి సర్వే నంబర్ 296లో 60.73 ఎకరాల భూమి ఉంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆ భూమిని ఆలయ ధర్మకర్తల మండలి, గ్రామస్తుల ఆధ్వర్యంలో కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు సతీష్ కుమార్, సగికుమార్ అన్నదమ్ములు దేవాదాయ శాఖ భూమిపై కన్ను వేసి స్థానిక ఎమ్మెల్యే అండతో గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తూ నాలుగు ఎకరాల భూమిని జేసీబీతో చదును చేస్తున్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ స్థానిక తహసీల్దార్ కు ఫిర్యాదు చేయగా వారికి ఎమ్మెల్యే అండదండలున్నాయి, తాము ఈ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని గ్రామస్తులకు తెలపడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా గత ప్రభుత్వంలో మీరు చేసుకోలేదా? అని దురుసుగా మాట్లాడారు. ఎమ్మెల్యే ఫోన్ చేసిన మాట వాస్తవమేనని, ఎమ్మెల్యే మాట తాము వినాలని చెప్పారు. గ్రామస్తుల ఇచ్చిన వినతి మేరకు ఇరుపక్షాల పత్రాల ఆధారంగా సర్వే చేసి, దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఎట్టకేలకు మోటారు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగలో తాగునీటి బోరుకు ఎట్టకేలకు మోటారు ఏర్పాటు చేశారు. తాగునీటి బోరు పాడైందని, నిధులు మంజూరు చేయించుకుని, మోటారు ఏర్పాటు చేయకుండానే నిధులు స్వాహా చేసిన విషయంపై 'రూ.1.85లక్షలు మెక్కేశారు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో విధిలేక సంబంధిత టీడీపీ నేత కొత్త మోటారును మంగళవారం బోరుకు అమర్చారు.

గాయపడిన యువకుడి మృతి



చాణిక్యవర్మ(ఫైల్)



చాణిక్యవర్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న జీజేఎం ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవులునాయుడు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. రెండు రోజుల కిందట గుడిపాల క్రాస్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో రామభద్రాపురం గ్రామానికి చెందిన చాణిక్యవర్మ(22) తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం చాణిక్యవర్మ వేము ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్నాడు.

ఆర్థిక సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన చాణిక్యవర్మ కుటుంబ సభ్యులకు జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవులునాయుడు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబ సభ్యుల ధైర్యం చెప్పి వారిని ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ దుర్మరణం



ధనంజయనాయుడు(ఫైల్)

ఐరాల: మండలంలోని పొలకల సచివాలయం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాంపల్లెకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ ధనంజయనాయుడు(51) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని నాంపల్లెకు చెందిన ధనంజయనాయుడు ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం పొలకల సంతగేటుకు వెళ్లాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో యల్లంపల్లె నుంచి మట్టి లోడ్‌తో వస్తున్న ఓ ట్రాక్టర్ పొలకల సచివాలయం వద్ద ద్విచక్రవాహనంలో వెళుతున్న ధనంజయనాయుడికి ప్రమాదవశాత్తు ట్రాలీ తగలడంతో ట్రాలీ చక్రం కింద పడి తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఐరాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య హరిత, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీఎస్సీ రోస్టర్ పాయింట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన ప్రక్రియలో రోస్టర్ పాయింట్లను విద్యాశాఖ అధికారులు మంగళవారం విడుదల చేశారు. నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న రోస్టర్ రిజర్వేషన్ పాయింట్లను పరిశీలించుకునేందుకు వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన పాయింట్లను సబ్జెక్టులు, కులాల వారీగా ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ ఆమోదం పొందడంతో ఆ వర్గానికి గ్రేడ్ 1, 2, 3 పాయింట్‌లు కేటాయించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రకటించిన పోస్టులు మొత్తం 1,478. ఇందులో 1,317 పోస్టులను జిల్లా పరిషత్, మండల పరిషత్ (స్థానిక సంస్థలు)లకు కేటాయించారు. మున్సిపాలిటీకి చెందిన పాఠశాలలకు 64, నగరపాలక కార్పొరేషన్ పాఠశాలలకు 97 పోస్టులు కేటాయించారు. కులాల వారీగా చూస్తే..

రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు ఇలా..

సామాజిక వర్గం	జిల్లా/మండల పరిషత్	మున్సిపల్	నగరపాలక	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ–ఏ	94	06	11	111
బీసీ–బీ	127	05	07	139
బీసీ–సీ	18	01	0	19
బీసీ–డీ	91	05	06	102
బీసీ–ఈ	48	02	03	53
ఎస్సీ గ్రేడ్ 1	16	01	04	21
ఎస్సీ గ్రేడ్ 2	84	04	06	94
ఎస్సీ గ్రేడ్ 3	102	04	06	112
ఎస్టీ	85	05	05	95
ఈడబ్ల్యూఎస్	125	05	08	138
పీహెచ్– విజువల్	01	0	0	01
పీహెచ్–హియర్	10	0	0	10
ట్రైబల్ వెల్ఫేర్(ఆశ్రమ)	05	0	0	05
మొత్తం	1,317	64	0	1,478

సర్ప నేస్తం.. శ్రీకాంత్

పాము కనిపిస్తే!.. అమ్మో! పామంటూ పరిగెత్తడం మానవ నైజం. అదే అతడైతే!.. పామెక్కడంటూ ముందుకు దూకుతాడు. నిమిషాల వ్యవధిలో ఇట్టే పట్టి అట్టే బంధిస్తాడు. ఆపై ఆ పామును అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి సురక్షితంగా వదలిపెడతాడు. ఆయనే స్నేక్ క్యాచర్ శ్రీకాంత్.

- స్నేక్ క్యాచర్‌గా ప్రశంసలు
- జనావాసాల్లో వెయ్యికి పైగా పాములు పట్టివేత
- అటవీశాఖ నుంచి రెండు పర్యాయాలు అవార్డులు



నారాయణవనం తుంబూరులో..



చెరుకు తోటలో కొండ చిలువను పట్టుకొస్తున్న శ్రీకాంత్

పుత్తూరు: స్థానిక అటవీశాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేలూరు శ్రీకాంత్ పాములు పట్టడంలో అ సాధారణ నైపుణ్యం ప్రదర్శిస్తూ అందరికీ ఆప్తుడుగా మన్ననలు పొందుతున్నారు. చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలం పీవీపురం గ్రామానికి చెందిన అమాసయ్య, కుమారి దంపతులకు ఐదుగురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు వి.శ్రీకాంత్. చిత్తూరు కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ జీపు డ్రైవర్‌గా పనిచేసిన అమాసయ్య 1999 రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఇంటికి పెద్ద కుమారుడిగా తల్లితో పాటు ముగ్గురు చెల్లెళ్లు, ఒక తమ్ముడి పోషణ భారం శ్రీకాంత్‌పై పడింది. ఇంటర్ పూర్తి చేసిన శ్రీకాంత్ 2013లో పుత్తూరు ఫారెస్ట్ ఆఫీస్ బేస్ క్యాంప్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరాడు. ముగ్గురు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేసిన శ్రీకాంత్ ప్రస్తుతం పుత్తూరు మండలం మూలకోన చెక్‌పోస్టు వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అటవీశాఖ అధికారుల అనుమతితో 2020లో పాములు పట్టడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందాడు. అప్పటి నుంచి 5 ఏళ్లలో పుత్తూరు, కార్వేటినగరం, వడమాలపేట, నారాయణవనం, నగరి, నింద్ర, పిచ్చాటూరు, కేవీబీపురం మండలాల్లోని జనావాసాల్లో వెయ్యికి పైగా పాములను పట్టి, అటవీ ప్రాంతంలో వదలిపెట్టాడు.

అధికారుల నుంచి అవార్డులు

శ్రీకాంత్ సామాజిక సేవలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు అతనికి 2022, 2023లో రెండు సార్లు జీవవైవిధ్య సంరక్షణ, పాము రక్షణలో ఉత్తమ పురస్కారాలను ఇచ్చి సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాములకు సైతం ఎలాంటి హాని కలగకుండా వాటిని అటవీప్రాంతంలో వదలిపెట్టడంతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడడంలో చూపుతున్న చొరవకు ఇటు ప్రజల నుంచి శ్రీకాంత్ ప్రశంసలందుకొంటున్నాడు.



అవార్డు అందుకొంటున్న శ్రీకాంత్ (ఫైల్)

ప్రాణాంతక సర్పాలైనా సై!

శ్రీకాంత్ పలు కార్యాలయాల్లో, ఇళ్లలో జొరబడిన ప్రమాదకర సర్పాలను సైతం చాకచక్యంగా పట్టుకున్న సందర్భాలు అనేకం. పుత్తూరు చుట్టపక్కల పది మండలాల్లోని ప్రజలకు పాము కనబడితే ముందుగా గుర్తుకొచ్చే పేరు శ్రీకాంత్. వెంటనే అతని సెల్ నంబర్‌కు ఫోన్ వెళుతుంది.. ఆపై ఆపాము బందీ అవుతుంది.

పాములకు మనుషులంటే భయం

వాస్తవానికి పాములకే మనుషులంటే భయం. వాటిని కొట్టబోతేనే అవి బుసకొట్టి మనల్ని భయపెడతాయి. వాటిని గాయపరిస్తేనే అవి మనల్ని కాటు వేయడానికి ప్రయత్నిస్తాయి. పాము కనిపించగానే భయపడకండి. దానిని చంపడానికి ప్రయత్నించకండి. దగ్గరలోని అటవీశాఖ అధికారులకు తెలపండి. లేదంటే నా సెల్ నంబర్ 83746 00964కు ఫోన్ చేయండి. నేను వచ్చి పామును పట్టుకెళతా. 12 ఏళ్లుగా అటవీశాఖలో అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్‌గా పనిచేస్తున్నాను. ఇకనైనా నాకు టైమ్ స్కేల్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

– వి.శ్రీకాంత్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, పుత్తూరు అటవీశాఖ